
సాక్షి బాపట్ల

ఆదివారం । 23 । మార్చి । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 519.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



చేప పిల్లలు విడుదల

విజయపురిసౌత్: అనుపు వద్ద కృష్ణా జలాశయంలోకి మత్స్యశాఖ అధికారులు 10 లక్షల చేప పిల్లలను శనివారం విడుదల చేశారు.



నృసింహుని సేవలో..

మంగళగిరి టౌన్: మాజీ సీఎం ఎన్టీఆర్ తనయుడు మోహనకృష్ణ శనివారం స్థానిక లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
బాపట్ల	6.24	4.53
నరసరావుపేట	6.26	4.55
గుంటూరు	6.24	4.53

న్యూస్‌రీల్

పీఎం అజయ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



అద్దంకి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం అజయ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పథకానికి ఎంపికైన 13 మందికి శనివారం రూ.17.50 లక్షల రుణాల చెక్కులు అందజేశారు. ఏపీఎం మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరయ్యే ఈ రుణంలో రూ.50వేలు రాయితీ పోను, లబ్ధిదారు వాటా, మిగిలిన రుణాన్ని సున్నా వడ్డీతో తిరిగి సక్రమంగా చెల్లించాలని చెప్పారు. ఏపీఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన



కర్లపాలెం: లైంగిక వేధింపుల నివారణ, పోక్సో చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ఆరో అదనపు జడ్జి కె.శ్యామ్‌బాబు చెప్పారు. కర్లపాలెం మండల పరిధిలోని పేరలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి కె.శ్యామ్‌బాబు మాట్లాడుతూ లైంగిక వేధింపులు, అశ్లీలత వంటి నేరాల వంటివి విచారించేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేశారన్నారు. చట్టాలపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా పేదలు న్యాయ సహాయం పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో పేరలి గ్రామ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, న్యాయవాదులు, డి.కిరణ్, టి.వి జయ్‌కుమార్, కె.శ్రీనివాసరావు, వీరాస్వామి ఫౌండేషన్ అధ్యక్షుడు గొర్రుముచ్చు వందనం తదితరులు పాల్గొన్నారు.


ఆన్‌లైన్‌లోనే సహకార సంఘాల లావాదేవీలు



నరసరావుపేట: ఇకపై సహకార సంఘాలలో అన్ని లావాదేవీలు ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించాలని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా శనివారం జిల్లా సహకార బ్యాంక్ ఆవరణలో పీఏసీలు, సీఈవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వాణిజ్య బ్యాంక్‌ల మాదిరి సహకార సంఘాలు పనిచేయాలన్నారు. అవసరమైతే తగిన ఫర్నిచర్ సమకూర్చుకోవాలని తెలిపారు. సభ్యులకు ఆన్‌లైన్ సేవలు అందించాలని చెప్పారు. గో లైవ్‌కు వెళ్లిన అన్ని పీఏసీలు ముందుగా నెట్‌వర్క్ పనితీరును పరీక్షించుకోవాలని చెప్పారు. సభ్యుల డేటా సరిగ్గా నమోదైందో లేదో లాగిన్ చేసి పరిశీలించుకోవాలని కోరారు. సిబ్బందిలో అవసరమైన వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. సిస్టమ్ ఆడిట్‌లో భాగంగా అన్ని మాడ్యూల్స్ సరిగ్గా పని చేస్తున్నాయో లేదో పరీక్షించుకోవాలని సూచించారు. రియల్ టైం ఎంట్రీ ప్రారంభించాలని, ఏ రోజుకురోజు ఆన్‌లైన్ లావాదేవీలు సక్రమంగా చేస్తూ సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించేందుకు ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. జిల్లాలో 59 పీఏసీలకుగాను 38 పీఏసీలలో గో లైవ్‌కు వెళ్లిన సీఇవోలు, జిల్లా సహకార ఆడిట్ అధికారి డి. శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోగిపోతున్న మోసాలు!

పెట్రోలు బంకుల్లో మోసాలతో యజమానులు, సిబ్బంది పేట్రేగిపోతున్నారు. ఒక్కసారి సున్నా చూసుకోండి అని చెబుతూనే వాహనదారులను నిండా ముంచుతున్నారు. డబ్బుల కోసం చూపు పక్కకు తిప్పితే చాలు రీడింగ్‌లో చక్రం తిప్పేస్తున్నారు. రాత్రి వేళ చిప్‌లను మార్చేసి అడ్డగోలుగా దోచుకుంటున్నారు. అన్నీ సజావుగా ఉన్నాయని మోసగిస్తున్నారు. బంకులోకి అడుగుపెట్టిన వారికి గొంతు తడుపుకొందామన్నా గుక్కెడు నీళ్లు దొరకడం లేదు. అసలు బంకుల్లో ఉండాల్సిన కనీస వసతులు సంగతి దేవుడెరుగు.. ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు. వినియోగదారులకు నాణ్యత, పరిమాణం విషయంలో అన్యాయం జరుగుతోంది.



- సున్నా రీడింగ్ అంటూనే నిలువునా దగా
- ఇంధనం కొలతల్లో సిబ్బంది చేతివాటం
- అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కరవు
- గాలి నింపే పరికరాలూ అంతంత మాత్రమే
- తీవ్రంగా నష్టపోతున్న వినియోగదారులు
- చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం

చీరాల /చీరాల టౌన్: పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ప్రజలను దోచుకుతింటున్నాయి. లీటర్ పెట్రోల్, డీజిల్ కొట్టించినా.. కేవలం వినియోగదారుడికి వచ్చేది మాత్రం 900–950 ఎంఎల్ మాత్రమే. సగటున లీటరుకు 50–100ఎంఎల్ తక్కువగా వస్తోంది. అంతేగాక లీటర్ పెట్రోల్ ధర రూ. 109.23 పైసలు ఉండగా వినియోగదారుడి నుంచి మాత్రం రూ.110 వసూలు చేస్తున్నారు. సగటున ఒక్కో పెట్రోల్ బంకు రోజుకు లీటరుకు 50 ఎంఎల్ పెట్రోల్, రూ.77 పైసలు అదనంగా వసూలుతో ప్రతిరోజు రూ. 5 వేలు నుంచి రూ.8 వేలు అక్రమార్జన చేస్తున్నారు. చీరాల ప్రాంతంలో ఉన్న అన్ని పెట్రోల్ బంకుల్లో ఇదే తరహా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. 'సాక్షి' పరిశీలనలో కారంచేడు గేటు సెంటర్‌లో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకు తరచూ వివాదాలకు కేంద్రంగా మారినట్లు తేలింది. గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం మాత్రం శూన్యం. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమాలు పెరిగిపోతున్నాయి.



ఓ బంకులో లీటర్ పెట్రోల్‌కు 950 ఎంఎల్ మాత్రమే వచ్చిన దృశ్యం

వాహనదారుల గగ్గోలు

లీటరుకు కచ్చితమైన కొలతతో పెట్రోలు రావడం లేదంటూ వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్చూరులో ఐవోసీఎల్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీలకు చెందిన బంకులు ఉన్నాయి. మిషన్ లోపల కంపెనీకి చెందిన ఫిట్టర్ కొన్ని మార్పులు చేస్తారు. దీని వలన ప్రతి లీటరుకు 3 నుంచి 5 మిల్లీ లీటర్లు మిగిలి అండర్ గ్రౌండ్‌లో ఉన్న ట్యాంకులో ఉండిపోతుంది. అలా రోజుకు ఒక్కో బంకు 25 లీటర్ల పెట్రోలు వంతున నెలకు రూ.82,500 మేరకు మోసగిస్తోంది. ఫిట్టర్‌కు తెలియకుండా బంకులను తనిఖీ చేయడానికి తూనికలు, కొలతల శాఖ అధికారులు ఎవరూ రారు. అన్‌లోడ్ చేయడానికి కంపెనీ నుంచి ఆయిల్ ట్యాంకర్ వచ్చినప్పుడు సుమారు 100 లీటర్ల ఆయిల్‌ను తీసి పక్కన పెడతారు. దీనిని అండర్‌గ్రౌండ్ ట్యాంకులో పోస్తే మీటర్ రీడింగ్‌లో తేడా వస్తుందని అలా చేస్తుంటారు. ఇటీవల పలు బంకుల్లో చిప్ అవినీతి జరుగుతోంది. రిమోట్ కంట్రోల్ ద్వారా లీటరు కంటే తక్కువ ఆయిల్ వాహనంలోకి పోసేందుకు వీలుంటుంది. అధికారులు తనిఖీ చేస్తేగానీ ఈ విషయాలు బయటకు వస్తాయని వాహనదారులు పేర్కొంటున్నారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఆదాయం పెంచేలా ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచన

బాపట్ల: వ్యవసాయం, మత్స్య, ఆక్వా ఉత్పత్తులను పెంచడం ద్వారా ఆదాయం వృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. వివిధ శాఖల అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు 10.70 శాతం లక్ష్యంతో చర్యలు తీసుకోవాలని చెప్పారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 28,184 హెక్టార్లలో సేంద్రియ సాగు చేశామన్నారు. ఏడు శాతం ఉత్పత్తి పెరిగేలా 30,998 హెక్టార్లు లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. తద్వారా జిల్లాకు రూ.4,943 కోట్లు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మత్స్య, ఆక్వా రంగాల ద్వారా ఏడాదిలో రూ.12,440 కోట్లు ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని, 13.41 వృద్ధిరేటు సాధించాలన్నారు.

పర్యాటకంపై దృష్టి పెట్టండి

అతి తక్కువ నిధులతో ఆరు బీచ్‌లను అభివృద్ధి చేయడం ద్వారా ఏడాదికి రూ.535 కోట్లు ఆదాయం లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. పర్యాటకంలో 18.88 వృద్ధి రేటు ఉంటుందన్నారు. అటవీ సంపద వృద్ధి చేయాలని సూచించారు. ఉద్యాన పంటలు అదనంగా 1,650 హెక్టార్లకు విస్తరించాలని తెలిపారు. విస్తీర్ణం పెరుగుదలతో ఉత్పత్తులు అధికం అవుతాయని.. తద్వారా రూ.4,065 కోట్ల ఆదాయం జిల్లాకు వస్తుందన్నారు. 11.49 శాతం వృద్ధిరేటు సాధన దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. మూడు వేల హెక్టార్లలో సూక్ష్మ, బిందు సేద్యం సాగయ్యేలా రైతులను చైతన్య పరచాలన్నారు. రానున్న ఏడాదిలో 20% వృద్ధిరేటు సాధన దిశగా అధికారులు అడుగులు వేయాలని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా సంప్రదాయ పద్ధతిలో 54,654 గేదెలు, ఆవులు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. కృత్రిమ పద్ధతిలో 49,675 గేదెలను ఉత్పత్తి చేయాలన్నారు. దీంతో పాల దిగుబడి మరింత పెరిగి ఆదాయం రూ.6,630 కోట్లకు చేరే లక్ష్యంతో 15.20 శాతం వృద్ధిరేటుగా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

పరిశ్రమల విస్తరణ కీలకం

గ్రానైట్, ఇసుక, కంకర వనరులతో రూ.110 కోట్ల ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విస్తరణతో వార్షికాదాయం రూ.1,941 కోట్లకు పెరిగేలా చూడాలన్నారు. తద్వారా 37.51% వృద్ధిరేటు పెరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో రైల్వే లైన్ ద్వారా రూ.109 కోట్ల ఆదాయం వస్తోందన్నారు. తాజాగా రైల్వే గూడ్స్ రేక్ వంటి తదితర వనరులతో ఏడాదిలో వృద్ధిరేటు 5.83% పెరగనుందన్నారు. గ్రామీణ నీటి సరఫరా మరింత పెంచడానికి రూ.167 కోట్లు పనులు చేయాలని ఆయన తెలిపారు. ప్రజా ప్రయోజనం కోసం పైప్ లైన్ల నిర్మాణం పెంచాలన్నారు. విద్యుత్ శాఖ ద్వారా రూ.731 కోట్లు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రచించాలన్నారు. ప్రస్తుతం రూ.17.91 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణాలు లక్ష్యంగా పనులు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక ఉత్తర్వుల్లో తప్పిదాలు

- కాంట్రాక్టు ఉద్యోగానికి బదులుగా అవుట్‌సోర్సింగ్ అని టైపింగ్
- జీజీహెచ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సిబ్బంది తీరుపై ఆందోళన



గుంటూరు మెడికల్: గుంటూరు గవర్నమెంట్ జనరల్ హాస్పటల్(జీజీహెచ్) కార్యాలయ ఉద్యోగుల తీరుపై రోజురోజుకు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్డీ కార్యాలయంలో ఫార్మాసిస్టుల ప్రమోషన్‌లకు జీజీహెచ్ నుంచి జాబితాను పంపించే విషయంలో తప్పిదాలు చేసి మెమోలు పొందిన చరిత్ర ఇక్కడి కార్యాలయ ఉద్యోగులది. విషయమేమిటంటే.. 19 పారా మెడికల్ పోస్టులకు గుంటూరు వైద్య కళాశాలలో రిక్రూట్‌మెంట్ నిర్వహించి శుక్రవారం అపాయిమెంట్ ఆర్డర్స్ ఇచ్చారు. శనివారం విధుల్లో చేరేందుకు నియామక ఉత్తర్వులు తీసుకుని ఆసుపత్రికి వెళ్లిన ఉద్యోగులకు ఆ ఉత్తర్వుల్లోని తప్పిదాలతో గుండె ఆగినంత పనైంది. కాంట్రాక్టు ఉద్యోగానికి నియామక ఉత్తర్వులు ఇవ్వాల్సిన చోట అవుట్‌సోర్సింగ్ పేరుతో అపాయింట్‌మెంట్‌లో తప్పిదాలు టైపింగ్ చేశారు. దీంతో ఆందోళన చెందిన ఉద్యోగులు తమ అపాయింట్‌మెంట్ తప్పిదాలను సరిదిద్దాలని కోరినా అదేమీ కాదులే టేకిటీజీగా తీసుకోండంటూ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం ఉద్యోగులు సిల్లీగా సమాధానం చెప్పడం అభ్యర్థులకు విస్మయం కలిగించింది. గట్టిగా అడిగిన కొంతమందికి పెన్నుతో సరిదిద్ది మరికొంత మందిని సోమవారం రావాలని ఆదేశించారు. కార్యాలయ ఉద్యోగులు చేసిన తప్పిదాలకు తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని అభ్యర్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీజీహెచ్ అధికారులు ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంపై దృష్టి సారించి ఆసుపత్రి పరువు బజారున పడకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు.

అక్రమార్జనకు దగ్గరిదారి

రాజధానిలో రోడ్లను తవ్వేస్తూ మట్టి అక్రమ విక్రయాలు



కృష్ణాయపాలెం - మందడం రోడ్డులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆంధ్రప్రదేశ్ సచివాలయానికి 5,6 కిలోమీటర్ల దూరంలోని కాజా టోల్ గేట్ నుంచి గన్నవరం వరకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణానికి మట్టి తవ్వి కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఈ మట్టిని కొంతమంది వ్యాపారులకు లారీ రూ.2వేలకు అమ్ముతుంటే ఆ వ్యాపారులు లారీ రూ.7వేల నుంచి రూ.8 వేలకు ఇతరులకు అమ్ముకుంటున్నారు. వాస్తవానికి ఈ మట్టిని తరలించేందుకు మైనింగ్‌శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి. అయితే సదరు కాంట్రాక్టర్ అవేవీ పట్టించుకోకుండా మట్టిని అమ్ముకోవడం ప్రారంభించారు. ఇదే అదునుగా తీసుకుని కొంతమంది అక్రమార్కులు సైతం రాజధాని ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన రోడ్లను సైతం యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. గత ప్రభుత్వం పేదలకు నివాసాలుగా ఇచ్చిన స్థలాల్లో రోడ్లను సైతం కొన్ని చోట్ల తవ్వేశారు. రాత్రిళ్లు ఆ రహదారిపై మట్టిని తవ్వి ఒక ప్రాంతంలో డంపింగ్ చేసి ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేసి అమ్ముకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాల విషయంలో ఈ మధ్యకాలంలో పలు కేసుల్లో నమోదైన ఓ వ్యక్తి ఈ తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. రాజధాని గ్రామాలైన కృష్ణాయపాలెం శివారు, వెంకటపాలెం, మందడం శివారు ప్రాంతాల్లో, కొండవీటి వాగు రోడ్డుకు సంబంధించిన మట్టిని రాత్రికి రాత్రి వందల సంఖ్యలో లారీలు పెట్టి బయటకు తరలిస్తున్నారు. ఐదు గ్రూపులుగా ఏర్పడి ఎవరికి వారు పొక్లెయిన్లు తీసుకువచ్చి వారంతట వారే హద్దులు నిర్వహించుకుని మట్టి తవ్వకాలు నిర్వహించి జేబులు నింపుకొంటున్నారు.

నిబంధనలకు నీళ్లు

రాజధాని ప్రాంతంలో నిర్వహించే పనుల్లో కాంట్రాక్టర్లు నిబంధనలకు నీళ్లు వదిలి తమ లాభార్జన కోసం పనిచేస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. దీనికి నిదర్శనం కాజా టోల్ వద్ద నుంచి గన్నవరం వరకు నిర్మించే రహదారిలో కాజా టోల్‌గేట్ వద్ద నుంచి వెంకటపాలెం శివారు వరకు రోడ్డు నిర్మించేటప్పుడు తవ్వే మట్టిని నిబంధనలకు విరుద్ధంగా అమ్ముకోవడమే. సదరు కాంట్రాక్టర్లు అవినీతికి దారి చూపడంతో కొంతమంది స్వార్థపరులు రాజధానిలో నిర్మించిన రహదారులను సైతం తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రాజధానిలో చేపట్టిన అభివృద్ధి పనులపై నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పచ్చ నేతల బియ్యం మేత!

- రేషన్ బియ్యం దందాతో అక్రమార్జన
- అప్పికట్ల నుంచి గుజరాత్‌కు రవాణా
- బాపట్ల, పొన్నూరు నుంచి సేకరణ
- అప్పికట్ల మిల్లులో రీసైక్లింగ్ చేసి తరలింపు
- బాపట్ల పచ్చ నేతకు నెలకు రూ. 25 లక్షలు కప్పం

పేదలకు అందాల్సిన చౌక బియ్యం పచ్చ నేతల పరం అవుతున్నాయి. ప్రతి నెల ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యాన్ని డీలర్లు స్థానిక పచ్చ నేతలు నియమించుకున్న అక్రమ రవాణాదారులకు అప్పగిస్తున్నారు. వాటిని వ్యాపారులు రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి గుజరాత్‌కు తరలిస్తున్నారు. ఇందుకుగాను నియోజకవర్గ పచ్చ నేతకు రూ. 25 లక్షలకు తగ్గకుండా కప్పం చెల్లిస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున చౌకబియ్యం గుజరాత్‌కు తరలిపోతోంది. బాపట్ల శివారులోని అప్పికట్లకు చెందిన ఒక వ్యాపారి బాపట్ల, పొన్నూరు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్నాడు. ప్రతినెలా 25 వేల క్వింటాళ్ల వరకు సేకరించి రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేసి ప్యాక్ చేస్తున్నాడు. అనంతరం బియ్యాన్ని గుంటూరు తరలించి, అక్కడి నుంచి గుజరాత్‌కు అక్రమ రవాణా చేస్తున్నాడు. ఇందుకోసం పౌరసరఫరాల శాఖ, పోలీసు శాఖ అధికారులకు ప్రతి నెల మామూళ్లు ముట్టజెబుతున్నాడు. బాపట్ల పచ్చ పార్టీ ముఖ్య నేత అనుచరుడిగా ఉన్న సదరు మిల్లర్.. యజమాని పచ్చ నేతకు నెలకు రూ. 15 లక్షల వరకు కప్పం చెల్లిస్తున్నట్లు ప్రచారం ఉంది. ఇదే నియోజకవర్గం నుంచి మరో ఇద్దరు వ్యాపారులు సైతం ఈ దందా సాగిస్తున్నట్లు సమాచారం. వీరు కూడా పచ్చనేతకు రూ. 10 లక్షల - రూ.15 లక్షల వరకు కప్పం చెల్లిస్తున్నట్లు పచ్చ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

అధికారంలోకి రాగానే బరితెగింపు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో పేదలకు ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని పచ్చ నేతలు అక్రమంగా తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. జిల్లాలోని బాపట్ల, పర్చూరు, అద్దంకి, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలోని వారి అనుచరులు ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వీరంతా బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పచ్చనేతల అండతో డీలర్ల నుంచి చౌక బియ్యాన్ని సేకరిస్తున్నారు. కార్డుదారులకు కిలో రూ. 12 చొప్పున ఇచ్చి కొంటున్న మాఫియా అదే బియ్యాన్ని రూ. 35 నుంచి రూ.40కు అమ్మకం సాగిస్తున్నట్లు సమాచారం. చాలా నియోజకవర్గాల్లో కార్డుదారులకు పైసా ఇవ్వకుండా కొందరు పౌరసరఫరాల శాఖ అధికారుల సహకారంతో స్టాకు పాయింట్ల నుంచే బియ్యాన్ని లిఫ్టు చేస్తున్నారు. బియ్యం అప్పగించినందుకు నియోజకవర్గ పచ్చనేతకు రూ. 25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు మామూళ్లు ముట్టజెబుతున్నారు. బియ్యం ప్రస్తావన తెస్తే కార్డులు రద్దు చేస్తామని పచ్చనేతలు బెదిరింపులకు దిగుతుండడంతో చాలామంది పేదలు బియ్యం అందక పోయినా నోరు మెదపడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఈ బెదిరింపుల పర్వం కొనసాగుతోంది.

పట్టించుకోని అధికారులు

బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల ప్రాంతాల్లో సేకరించిన బియ్యాన్ని స్మగ్లర్లు గుజరాత్‌కు తరలిస్తున్నారు. చీరాల, పర్చూరు, అద్దంకి, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో సేకరించిన బియ్యాన్ని కృష్ణపట్నం పోర్టుకు చేరుస్తున్నారు. అక్కడి నుంచి సౌతాఫ్రికాకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ దందాను అడ్డుకోవాల్సిన అధికారులు నెల మామూళ్లకు పరిమితమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మిల్లులు లీజుకు తీసుకుని మరీ..

- సేకరించిన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనుచరులు అద్దంకి, పర్చూరు ప్రాంతాలతోపాటు ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, మద్దిపాడు ప్రాంతాల్లోనూ కొన్ని రైస్ మిల్లులను లీజుకు తీసుకున్నట్లు సమాచారం. సేకరించిన చౌక బియ్యాన్ని దాచేందుకు ఆయా ప్రాంతాల్లో గోదాములు తీసుకున్నట్లు తీసుకున్నారు.
- పర్చూరు నియోజకవర్గంలో ఇంకొల్లుకు చెందిన ఇద్దరు నేతలు నియోజకవర్గ వ్యాప్తంగా బియ్యాన్ని సేకరించి ఇడుపులపాడు ప్రాంతంలోని ఒక రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేసి, అద్దంకి కేంద్రంగా ఉన్న మాఫియాకు అందిస్తున్నారు.
- చీరాల నియోజకవర్గంలో ఒంగోలుకు చెందిన ఓ ముఠా మొత్తం బియ్యాన్ని సేకరించి వాటిని మంత్రి అనుచరులకు అప్పగిస్తోంది.
- వేమూరు నియోజకవర్గంలో భట్టిప్రోలుకు చెందిన నేత నియోజకవర్గ వ్యాప్తంగా రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నాడు. ఇందుకోసం గ్రామ పంచాయతీకి ఇద్దరు చొప్పున పచ్చ నేతలకు బియ్యం సేకరణ బాధ్యతలు అప్పగించాడు. వారికి కమీషన్లు ముట్టజెబుతున్నాడు. అధికభాగం బియ్యాన్ని అద్దంకి మాఫియాకు, మిగిలిన బియ్యాన్ని కృష్ణా జిల్లా వ్యాపారులకు అప్పగిస్తున్నాడు.
- రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నం మండలానికి చెందిన మంత్రి అనగాని సత్యప్రసాద్ అనుచరుడు బియ్యం మాఫియాను నడిపిస్తున్నాడు. సేకరించిన బియ్యాన్ని అద్దంకి మాఫియాకు అందిస్తున్నాడు. పల్నాడు జిల్లానుంచి సైతం చౌకబియ్యం అద్దంకికి పెద్ద ఎత్తున తరలించి రీసైక్లింగ్ అనంతరం కృష్ణపట్నం పోర్టుకు తీసుకెళుతున్నాడు.

పార్థసారథి అలంకారంలో నరసింహస్వామి



పార్థసారథి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న నరసింహస్వామి

మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం పార్థసారథి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించగా ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన లంకా నాగేశ్వరరావు కుమారులు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన పచ్చళ్ళ సుబ్రహ్మణ్యం కుమారులు వ్యవహరించారు.

నేడు శ్రీరంగనాయకులు అలంకారం...

లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు శ్రీరంగనాయకులు అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ఈఓ రామకోటిరెడ్డి కోరారు.

జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన జిల్లాలలో బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జువెనైల్ జస్టిస్ బోర్డులో చైర్మన్, సభ్యులుగా సేవలు అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యవేక్షణ అధికారి బి.ఏ.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఏప్రిల్ 9వ తేదీలోగా స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు తిరస్కరించబడతాయని స్పష్టం చేశారు. వివరాలకు http//wdcw.ap.gov.in వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ కాలమ్ నుంచి తెలుసుకోవచ్చని సూచించారు. వివరాలకు జిల్లా పర్యవేక్షణ అధికారి, 9100045422 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

వలపర్ల తిరునాళ్లలో ఆధిపత్య పోరు

- తెలుగు తమ్ముళ్ల బాహాబాహి
- పోలీసుల లాఠీచార్జి



లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన తిరునాళ్లలో అధికార పార్టీకి చెందిన ఇరు వర్గాల మధ్య ఘర్షణ స్థానికంగా కలకలం రేపింది. అర్ధరాత్రి 12 గంటల నుంచి ఒంటి గంట మధ్య జరిగిన ఘర్షణలో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. వలపర్ల గ్రామ పొలిమేరలోని కోతి ఆంజనేయస్వామి ఆలయ తిరునాళ్ల శుక్రవారం రాత్రి నిర్వహించారు. స్థానిక రెండు సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకుల మధ్య కొన్ని నెలల నుంచి ఆధిపత్య పోరు నడుస్తోంది. తిరునాళ్లకు రెండు ప్రభల ఏర్పాట్ల కోసం చురుగ్గా ప్రయత్నాలు జరిగాయి కూడా. విషయం తెలిసిన ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం ఇద్దరు నాయకులను హెచ్చరించింది. ఒకే ప్రభను ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించింది. చివరకు ఒక ప్రభనే ఏర్పాటు చేసినా లోపల ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాత్రి ప్రభ స్టేజీపై డ్యాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. వలపర్ల శివారు గ్రామమైన ద్వారకపాడుకు చెందిన ఓ పది మంది యువకులు స్టేజీ సమీపంలో ఉండగా, మరో వర్గానికి చెందిన యువకులతో వివాదం ప్రారంభమైంది. మొదటి నుంచి ఆధిపత్య పోరు సమాచారం తెలిసిన సీఐ మద్దినేని శేషగిరిరావు ముందుగానే బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల మధ్య ప్రారంభమైన వివాదాన్ని మొదట్లోనే పోలీసులు వారికి సర్ది చెప్పి పంపించారు. తిరిగి 12:30 గంటల ప్రాంతంలో స్టేజీ వెనుక రెండు గ్రూపులు ఘర్షణకు తలపడ్డాయి. విషయం తెలిసిన సీఐ శేషగిరిరావు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఓ వర్గానికి చెందిన యువకులు పోలీసులను సైతం పక్కకు నెట్టివేసే ప్రయత్నం చేశారు. సీఐ ఆదేశాలతో పోలీసులు ఇరు వర్గాలపై లాఠీచార్జి చేశారు. చివరకు ఒంటిగంట ప్రాంతంలో పరిస్థితిని పోలీసులు అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

భార్యను హింసిస్తున్న భర్తపై కేసు నమోదు

అద్దంకి రూరల్: భర్త శారీరకం గాను, మానసికంగాను హింసిస్తున్నాడని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రవితేజ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన మంజుల రాజ్యలక్ష్మి, రామయ్యకు 14 ఏళ్ల కిందట వివాహం అయింది. వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. మద్యానికి బానిసైన రామయ్య భార్యను వేధిస్తూ ఈనెల 19వ తేదీన కర్రతో దాడి చేశాడు. దీంతో భార్యకు గాయాలయ్యాయి ఈ మేరకు మంజుల రాజ్యలక్ష్మి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే జీవితం అంధకారమే !

- జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ
- పెను భూతానికి బలి కావద్దు
- బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు



బాపట్ల టౌన్: బెట్టింగ్‌లకు పాల్పడితే జీవితం అంధకారంగా మారుతుందని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లను అదునుగా చేసుకొని కొందరు స్వార్థపరులు, చెడు నడత కలిగిన వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్‌లకు తెరలేపే అవకాశం ఉందని హెచ్చరించారు. బెట్టింగ్‌లకు బలి అవుతున్నవారిలో ఎక్కువ శాతం యువతే ఉంటున్నారని, సులభంగా నగదును అర్జించవచ్చునని ఆశ చూపుతూ ఊబిలో దించుతారని తెలిపారు. ఒక్కసారి అలవాటు పడితే వాటి నుంచి బయటకు రావడం కష్టం అవుతుందని సూచించారు. ఒకసారి ఆదాయం వచ్చినా పలుమార్లు నష్టపోతారని, వాటిని భర్తీ చేసుకోవడానికి, చేసిన అప్పులను తీర్చడానికి యువత దొంగతనాలకు, ఇతర నేరాలకు పాల్పడుతూ తమ భవిష్యత్తుని అంధకారం చేసుకుంటున్నారని వివరించారు. బెట్టింగ్ అనేది పెనుభూతం లాంటిదని, ఆశ చూపి అంధకారంలోకి నెట్టేస్తుందని హెచ్చరించారు. యువత దానికి బలి కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రికెట్ మ్యాచ్‌లను వినోదం కోసం మాత్రమే చూడాలని, బెట్టింగులు వైపు మొగ్గు చూపకూడదని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని, బెట్టింగులకు పాల్పడుతుంటే వారికి నచ్చచెప్పి ఆ ఊబిలో నుంచి బయటకు తీసుకురావాలని చెప్పారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారిపై, అనుమానితులపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. జిల్లాలో బెట్టింగులను నిర్వహించినా, అమాయకులను, యువతను ఊబిలోకి లాగాలని ప్రయత్నించినా ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. నిర్వాహకులను గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 112/100కు సమాచారం అందించాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

కబడ్డీ జట్టుకు అభినందనలు



క్రీడాకారులతో వైఎస్సార్ సీపీ నాయకులు

చినగంజాం: జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే సబ్ జూనియర్ పురుషుల రాష్ట్ర జట్టు క్రీడాకారులను వైఎస్సార్ సీపీ మండల నాయకులు శనివారం అభినందించారు. స్థానిక కొత్తపాలెం బాల కోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శిబిరంలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులను వారు కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, ఎస్. రామిరెడ్డి, రాజు వెంకటేశ్వరరెడ్డి, బొడ్డు ఏడుకొండల రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, మేడికొండ సునీల్, సూర్యనారాయణరెడ్డి, పాదర్తి ప్రకాష్, మార్కాపురం రామారావు, ఆట్ల పోతురాజు, శ్రీకాంత్, కోటిరెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

రైతులు గిడ్డంగుల్లోనే నిల్వ చేసుకోవాలి



గిడ్డంగులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజర్ శ్రీనివాసరెడ్డి

బాపట్ల: గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతులు పండించిన పంటలను గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవచ్చని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బాపట్ల గిడ్డంగుల వద్ద రైతులు ధాన్యం నిల్వలపై శనివారం అవగాహన కల్పించారు. మేనేజర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గిడ్డంగుల్లో ధాన్యం నిల్వ చేసి లాభాలు వచ్చినప్పుడు విక్రయించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు ప్రసూనారాణి మాట్లాడుతూ పంట కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టరు కె.ఎస్.పాల్, హైమాజ్యోతి, కె.సునీల్, అపర్ణ, శీతా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో యడ్లపాడు మండలం వంకాయలపాడుకు చెందిన వ్యక్తి మృత్యువాత పడిన ఘటన అనకాపల్లి జిల్లాలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు.. మండలంలోని వంకాయలపాడుకు చెందిన లారీ డ్రైవర్ షేక్ మస్తాన్‌వలి(62) మూడు రోజుల కిందట వైజాగ్‌కు లోడు తీసుకుని వెళ్లాడు. వైజాగ్ నుంచి ఐరన్ లోడ్‌తో తిరుగు ప్రయాణంలో ఉన్న లారీ, శుక్రవారం అర్ధరాత్రి అనకాపల్లిలో మరో లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో రెండు వాహనాలు ధ్వంసం కాగా, మస్తాన్‌వలి నడిపే లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జ కావడంతో డ్రైవర్ సీట్లోనే ఇరుక్కుపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. ఏడాదిన్నర క్రితం భార్యను కోల్పోయిన మస్తాన్‌వలి, ఇద్దరు సంతానంలో ఒక కుమార్తె కూడా కొద్దికాలం కిందట మృతి చెందింది. ప్రస్తుతం మరో కుమార్తె, అల్లుడు వంకాయపాడు గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. డ్యూటీకి అని వెళ్లిన తన తండ్రి విగతజీవిగా మారాడన్న వార్త విన్న కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపించింది.



మస్తాన్‌వలి (ఫైల్)

కృష్ణానదిలో పడి వ్యక్తి మృతి



రామ్‌కుమార్ మృతదేహం

అచ్చంపేట: కృష్ణానదిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కోగంటివారిపాలెంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం మేరకు మండలంలోని ఓర్వకల్లు గ్రామానికి చెందిన కోట జయరావు, సరోజినీల కుమారుడు రామ్‌కుమార్ (28) స్నేహితులతో కలసి శనివారం సాయంత్రం 5గంటల సమయంలో సమీపంలోని కృష్ణానదిలో సరదాగా ఈతకొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే నది లోతుల్లో జారి పడిపోయినట్లు తెలిసింది. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు తెలుపుతున్నారు. రామ్‌కుమార్ ఇటీవల వైద్యునిగా అర్హత పొంది గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో అసిస్టెంట్ వైద్యునిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. కుమారుడు అకస్మాతుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు తల్లడిల్లారు. పోలీసుస్టేషన్‌లో ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మేదరమెట్ల: గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల ఫైలాన్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. అద్దంకి దామవారిపాలేనికి చెందిన ఏలూరి ఆదినారాయణ (24) సొంత పని నిమిత్తం బైకుపై ఒంగోలు వెళ్లి తిరిగి అద్దంకి వస్తున్నాడు. మేదరమెట్ల ఫైలాన్ సమీపానికి రాగానే అద్దంకి వైపు వెళ్లేందుకు గాను సర్వీసు రోడ్డులోకి వచ్చే క్రమంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బైకును బలంగా ఢీకొని వెళ్లిపోయింది. దీంతో బైకుపై ఉన్న ఆదినారాయణ రోడ్డుపై పడి పోయాడు. తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మోసం చేసి డబ్బుతో పరారైన నిందితుడి అరెస్ట్

- డబ్బు రికవరీ
- 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు
- వివరాలు వెల్లడించిన సీఐ ప్రభాకరరావు

మాచర్ల: పొలం రిజిస్ట్రేషన్‌కు ఇవ్వాల్సిన డబ్బు తీసుకుని ఉడాయించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజు రిమాండ్ విధించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రభాకరరావు వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, తుక్కుగూడ గ్రామానికి చెందిన బండెల నరసింహారెడ్డికి దుర్గి మండలంలోని, ముటుకూరు గ్రామ శివారులో 6.88 ఎకరాల పొలం ఉంది. దీన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా మాచర్ల టౌన్‌కు చెందిన చింతా శ్రీనివాసరావు పరిచయం అయ్యాడు. 2022లో పొలం అమ్మకం విషయంలో చిత్తూరు జిల్లాకు చెందిన మైలా మల్లేష్ యాదవ్, సదరు వ్యక్తి మధ్యవర్తిగా ఉన్నాడు. నరసింహారెడ్డి తన పొలాన్ని దుర్గి మండలానికి చెందిన మాదాసు వెంకటేశ్వర్లుకు రూ.70.50 లక్షలకు విక్రయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనికి అడ్వాన్సుగా రూ.45 లక్షలు మాదాసు వెంకటేశ్వర్లు, మల్లేష్ యాదవ్‌కి ఇచ్చారు. అందులో రూ.15 లక్షలు తన వద్ద పెట్టుకొని రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తరువాతే ఇస్తాను అని మల్లేష్ యాదవ్ నమ్మించాడు. అది నమ్మి నరసింహారెడ్డి మార్చి 15న తన పొలంలో మాదాసు వెంకటేశ్వర్లు పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. నిందితుడి తన వద్ద ఉన్న ఫిర్యాదికి చెందిన రూ.15 లక్షలు, మాదాసు వెంకటేశ్వర్లు వద్ద నుంచి రావాల్సిన రూ.25.50 లక్షలు మొత్తం రూ.40.50 లక్షలు తీసుకొని రిజిస్ట్రేషన్ ఆఫీస్ నుంచి పారిపోయాడు. నిందితుడికి ఫిర్యాది ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందించక పోవడంతో మోసపోయినట్లు గ్రహించి సదరు విషయం గురించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ పి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ సంధ్యారాణి దర్యాప్తు చేపట్టారు. టెక్నాలజీని ఉపయోగించి నిందితుడిని చిత్తూరు జిల్లాలో ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి నగదు రికవరీ చేసి మాచర్ల కోర్టులో హాజరు పరచగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

మత్స్య సంపద, ఆక్వా సాగు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర కమిషనర్ రమాశంకర్‌నాయక్



రమాశంకర్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: మత్స్య సంపద, ఆక్వా సాగు పెంచడమే ప్రభుత్వం ముఖ్యోద్దేశమని మత్స్య శాఖ రాష్ట్ర కమిషనర్ రమాశంకర్‌నాయక్ అన్నారు. బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన కమిషనర్ రమాశంకర్‌నాయక్ స్థానిక కలెక్టరేట్‌కు శనివారం చేరుకున్నారు. జిల్లాకు తొలిసారిగా వచ్చిన కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ ఉన్నారు. అనంతరం బాపట్ల, చీరాలలోని రొయ్యల హేచరీలు, పాలీ చీట్ యూనిట్లు, బయోఫ్లోక్ టెక్నాలజీతో నడిచే యూనిట్లు, రొయ్యల ఫామ్, ప్రాసెసింగ్ యూనిట్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి కృష్ణకిషోర్, మత్స్యశాఖ అధికారులు, ఆక్వా చెరువులు, ప్రాసెసింగ్ యూనిట్ల నాయకులు, తదితరులు ఉన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ

బాపట్ల: పనిముట్ల కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక రాయితీ రుణాలను కుల వృత్తిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన హాలులో శనివారం ఆదరణ ఫేజ్- 3 కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు బాపట్ల రవికుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే 90% రాయితీని పొందడానికి పనిముట్ల ఖరీదులో 10% ముందుగా డీడీ చెల్లించాలని తెలిపారు. మంజూరు చేసిన అనంతరం ఈ డీడీలను కార్పొరేషన్‌కి అందించాలని ఆయన సూచించారు. కుల వృత్తుదారుల ఆర్థిక ఎదుగుదలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, స్వర్ణకార, రజక, మేదర, మొండిబండ, అగ్నికుల క్షత్రియ, బెస్త, వడ్డెర సంఘ నేతలు పాల్గొని వారి అభిప్రాయాలను తెలిపారు.

ఉగాది పురస్కారాలకు 12 మంది ఎంపిక

- హోంశాఖ పరిధిలోని అన్ని విభాగాల వారీగా అవార్డులు
- వివరాలు తెలియజేసిన ఎస్పీ తుషార్ డూడీ



అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్



సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్



బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

బాపట్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం హోంశాఖ తరపున పోలీసు, విజిలెన్స్, ఫైర్ విభాగాల్లో పనిచేస్తున్న పోలీసులకు, అధికారులకు, సిబ్బందికి ఉగాది పురస్కారాలను ప్రకటించింది. అవార్డులను ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీన అందుకోనున్నారు. జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన 12 మందిని ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు.

అవార్డు పొందిన అధికారి	విభాగం	అవార్డు కేటగిరి
తిరుపతి పాండురంగ విఠలేశ్వర్	అడిషనల్ ఎస్పీ	ఉత్తమ సేవా పతకం
జి.రామాంజనేయులు	బాపట్ల డీఎస్పీ	మహోన్నత సేవా పతకం
పి.జగదీష్ నాయక్	సీసీఎస్ డీఎస్పీ	సేవా పతకం
షేక్ మౌలుద్దీన్	అడ్మిన్ ఆర్ఐ	సేవా పతకం
ఏ.వి. సత్యనారాయణరెడ్డి	ఎస్‌బీ ఏఎస్‌ఐ	సేవా పతకం
డి శామ్యూల్	వేటపాలెం ఏఎస్‌ఐ	సేవా పతకం
ఊరిబండి బాబు	ఏఆర్ ఎస్‌ఐ	సేవా పతకం
వి. నాగమల్లేశ్వరరావు	ఏఎస్‌ఐ, చొడయపాలెం	సేవా పతకం
ఆర్ వి ఎస్ రెడ్డయ్య	హెడ్ కానిస్టేబుల్, భట్టిప్రోలు,	సేవా పతకం
మొఘల్ హైదరాలి బ్యాగ్	ఏఆర్ హెడ్ కానిస్టేబుల్	సేవా పతకం
ఎం.నాగార్జున,	ఏఆర్ కానిస్టేబుల్	సేవా పతకం
జి.రవిబాబు	ఈపూరుపాలెం పీసీ	ఉత్తమ సేవా పతకం

చెట్టును ఢీకొట్టిన బైక్ : వ్యక్తి మృతి

మాచవరం: ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నంద్యాల శివయ్య(65) వ్యక్తిగత పనులు ముగించుకొని బ్రాహ్మణపల్లి వైపు నుంచి గంగిరెడ్డిపాలెం వస్తుండగా ద్విచక్ర వాహనం టైరు పంక్చర్ కావడంతో బైక్ అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో శివయ్య ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.